# ఘోష

*సాయి బ్రహ్మానందం గొర్తి*

తెలతెలవారుతూ -

కోడి కూతతో పోటీపడే

పాలవాడి సైకిలి బెల్లూ -

పనిపిల్ల చేతిలో

గిన్నెల భూపాల రాగాలూ -

గుమ్మం ముందు

ఉదయించిన వార్తలూ -

వరండాలో కాఫీ చప్పరిస్తున్న

వార్తాపత్రికలూ -

మంత్రపుష్పాలతో దేహం కప్పుకున్న

దేముడి పటాలూ -

వెలుతురు కళ్ళు పొడిచినా

ముసుగు తీయని బద్ధకాలూ -

మత్తెక్కిన నిద్రని కుదిపేసే

వంటింటి వాసనలూ -

ఇవన్నీ ఒకప్పుడు

దేహాన్ని ఆవరించుకున్న అనుభవాలు!

రోజంతా పలకరించే ఆత్మ బంధువులు!!

ఇప్పుడు -

కొత్తగా చొరబడిన రంగుల గారడీ

మా పె(ప)దాలు తను తీసుకొని,

దాని చెవులు మాకిచ్చి -

తన గొంతుతో

మా మాటలు నొక్కేసి -

ముఖాన కృత్రిమత పూసి

మా నవ్వులకీ, రోదనలకీ, విరామాలకీ -

సమయాన్ని కేటాయించింది.

ఇప్పుడు తీరికలేని పక్షుల్లా

మౌనంగా తలూపే క్షణాల్లా

లోతుగా గొంతుకోసుకుపోయిన

మృత జీవుల ఘోష మాది.

ఈ దేహాలకి ఆప్యాయతల లేపనాలు ఎవరు పూస్తారో?

మౌన సమాధిపై మాటల గుచ్ఛం ఎవరుంచుతారో?

అనుభూతుల నిన్నకి పునర్జన్మ ఎవరందిస్తారో?

Copyright© 2004-05 eemaaTa.com. Content can not be reproduced without the permission of the author and the eemaaTa magazine. Contact eemaaTa at submissions@eemaata.com